సాక్షి
నంద్యాల
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



గ'మ్మత్తు' టానిక్..
టానిక్... కర్నూలు ఐదు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం. దీని యజమానులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో నిబంధనలు ఉల్లంఘించారు. 8లో▸



ఉల్లి.. కుళ్లి'పాయె'!
ఉల్లి పంట కోతలు పూర్తికావడంతో దిగుబడిని రైతులు ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేసుకున్నారు. దీంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోయి గ్రామాల్లో దుర్వాసన వస్తోంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.69
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 78.770
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 38,330
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 36,107

ధర లేక అష్ట కష్టాలు!

- శనగ క్వింటా రూ. 6 వేలకు పడిపోయిన ధర
- ఎనిమిది నెలలుగా గోదాముల్లో మగ్గుతున్న దిగుబడులు
- గత ప్రభుత్వ హయాంలో ఫూలేజి రకం క్వింటా రూ. 10 వేలు
- ప్రస్తుతం జేజే–11, ఫూలేజి రకాలకు ఒకే ధర
- దిగుబడుల నిల్వలతో రైతులపై అదనపు భారం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనలో శనగ రైతులు


కోవెలకుంట్లలోని గోదాములో నిల్వ ఉంచిన శనగ బస్తాలు

కోవెలకుంట్ల: ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను తట్టుకుని పంటను పండించిన రైతులకు రెక్కల కష్టమే మిగులుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. శనగ దిగుబడులను ఎనిమిది నెలలుగా గోదాముల్లో నిల్వ ఉంచినా ధర పెరగలేదు. దిగుబడుల నిల్వలతో రైతులపై అదనపు భారం పడుతోంది. గతేడాది అక్టోబర్ నెలలో జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1.72 లక్షల ఎకరాల్లో జేజే–11, ఫూలేజి రకాలకు చెందిన శనగ సాగుచేశారు. తుఫాన్లు, పొగమంచు చుట్టుముట్టి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేలు వెచ్చించారు. కౌలు రైతులపై కౌలు రూపంలో అదనంగా మరో రూ. 15 వేలు భారం పడింది. ఫూలేజి(తెల్ల శనగ) రకానికి చెందిన పైరుకు ఎక్కువశాతం ఎండు తెగులు ఆశించింది. తెగులుకు తోడు గత నవంబర్, డిసెంబర్ నెలల్లో తుఫాన్ల ప్రభావంతో కురిసిన వర్షాలు, అధిక తేమ కారణంగా పైరు దెబ్బతినింది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే జేజే- 11 రకానికి చెందిన శనగలో ఎకరాకు 5 క్వింటాళ్లలోపు, ఫూలేజి రకంలో 4 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చాయి. పెట్టుబడులు పెరిగి దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో 'ధర'హాసం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2023 రబీ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. మొత్తం 1.70 లక్షల ఎకరాల్లో శనగ సాగు కావాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా కేవలం లక్ష ఎకరాలకు మించి రైతులు సాగు చేయలేకపోయారు. ఎకరాకు 3 నుంచి ఐదు క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. జేజే–11 రకం క్వింటా రూ. 8,500, ఫూలేజి రకం రూ. 10 వేల వరకు ధర పలకడంతో రైతులు నష్టాల ఊబి నుంచి గట్టెక్కారు.

గోదాములు దాటని బస్తాలు

దిగుబడులు చేతికందేనాటికి మార్కెట్‌లో జేజే–11 రకం క్వింటా రూ. 5,600, ఫూలేజి రకం రూ. 6,500 మాత్రమే ధర పలికింది. ఈ ధరకు విక్రయించలేక పంట ఉత్పత్తులను గోదాములకు తరలించి భద్రపరుచుకున్నారు. జిల్లాలో దాదాపు 150 గోదాములు ఉన్నాయి. ఒక్కోదాంట్లో లక్ష బస్తాలు నిల్వ ఉంచారు. జిల్లా మొత్తం మీద కోటి 50 లక్షల బస్తాలు గోదాముల్లోనే ఉన్నాయి. రైతులు ఒక్కో బస్తాకు ఏడాదికి రూ. 100 ప్రకారం బాడుగ చెల్లించాల్సి ఉంది. ఎనిమిది నెలల నుంచి శనగకు మద్దతు ధర లేక దిగుబడులు గోదాముల్లో మగ్గుతున్నాయి.

'కూటమి' పాలనలో ఆ'ధర'ణ లేక..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోయినా పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. గతేడాది శన దిగుబడులు అంతంత మాత్రంగానే రావడం, మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక, దిగుబడులు నిల్వ ఉంచుకునేందుకు బాడుగ రూపంలో అదనపు భారం పడుతుండటంతో దిగాలు చెందుతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో జేజే-11, ఫూలేజి రకాలకు చెందిన శనగలు క్వింటా రూ. 6 వేలు మాత్రమే ధర పలుకుతోంది. మద్దతు ధర పెరుగుతుందని ఎనిమిది నెలల నుంచి ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. గోదాముల్లో నిల్వ ఉంచేనాటికి ఉన్న ధర కంటే గిట్టుబాటు ధర రోజు రోజుకు పతనమవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభం కానుండగా గతేడాది పండించిన పంట ఉత్పత్తులను ఇప్పటి వరకు అమ్ముకోలేని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం శనగకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం



గత ఏడాది సొంతపొలం ఎనిమిది ఎకరాలతోపాటు ఎకరా రూ. 18 వేలు కౌలు చెల్లించి మరో 12 ఎకరాల పొలాన్ని తీసుకుని శనగ పంట సాగు చేశాను. వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గిపోయాయి. తెల్లశనగలో ఎకరాకు 5 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. దిగుబడులు చేతికందేనాటికి మార్కెట్‌లో క్వింటా రూ. 6,500 ధర ఉండటంతో ఈ ధరకు అమ్ముకోలేక పంట ఉత్పత్తులను ఎనిమిది నెలల నుంచి గోదాములో భద్రపరుచుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నాను.
– అబ్రహం, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

ధర కల్పించి రైతులను ఆదుకోవాలి



రెండేళ్ల నుంచి పప్పుశనగ సాగు కలసి రావడం లేదు. గత ఏడాది మూడు ఎకరాల సొంత పొలంలో తెల్ల శనగ సాగుచేశాను. ఎకరాకు రూ. 20 వేలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికందే తరుణంలో తెగుళ్లు వచ్చి దిగుబడులు తగ్గాయి. మార్కెట్‌లో ధర లేకపోవడంతో గ్రామంలోని గోదాములో దిగుబడులు నిల్వ ఉంచుకున్నాను. జేజే–11 రకానికి రూ. 9 వేలు, తెల్లశనగకు రూ. 10 వేలు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.
– లక్ష్మీనారాయణ, రైతు, కలుగొట్ల, కోవెలకుంట్ల మండలం

న్యూస్‌రీల్

జిల్లాలో 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని 48 మందిని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు డీఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు. వీరిలో 40 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యాశాఖ అధికారి సిఫార్సు చేసిన ఆరుగురు అధ్యాపకులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిఫార్సు చేసిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. జాబితాను ఉప విద్యాశాఖ అధికారులకు, ఎంఈఓలకు పంపామన్నారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా శుక్రవారం అవార్డులు ఇస్తారని తెలిపారు.

డీటీఓగా శివారెడ్డి



నంద్యాల(న్యూటౌన్): జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ)గా శివారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఐశ్వర్యారెడ్డి బదిలీ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈయనను నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి బొకేను అందజేశారు.

అగ్రి పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి 8న కౌన్సెలింగ్

నంద్యాల(అర్బన్): అగ్రి పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఈ నెల 8న గుంటూరులోని లాంఫామ్‌లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ కోర్సుల్లో చేరేందుకు నమోదు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలను https://angrau.ac.in/ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని తెలిపారు.

యాగంటిపల్లి కేవీకేకు 'ఉత్తమ' అవార్డు


అవార్డును అందుకుంటున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి


బనగానపల్లె: యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి వరుసగా మూడో సంవత్సరం జోనల్ ఉత్తమ కృషి విజ్ఞానకేంద్రం అవార్డు లభించినట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి ధనలక్ష్మి తెలిపారు. జోన్-10 (తమిళనాడు, ఏపీ, తెలంగాణ, పుదిచ్చేరి) కృషి విజ్ఞాన కేంద్రాల ఏడాది సమావేశం తమిళనాడులోని వెల్లూరులో వీట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించారన్నారు. ఇందులో 72 కేవీకేలు ప్రగతిని వివరించాయన్నారు. చివరి రోజున యాగంటిపల్లె కేవీకే ఉత్తమ అవార్డు ఎంపికైనట్లు చెప్పారు. నంద్యాల జిల్లాలో నాణ్యమైన విత్తనాలు అందించడం, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించడం తదితర విషయాల్లో ప్రగతికి యాగంటిపల్లె కేవీకేకు ఉత్తమ అవార్డు వచ్చిందని తెలిపారు.

బలపనూరు టీచర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు


ఎ. శేషఫణి

పాణ్యం: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎ. శేషఫణి ఎంపికయ్యారు. అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుడిని ఎంఈఓలు, హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. మహానంది మండలం గాజులపల్లె ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ఈయన కృషి చేశారు. అలాగే శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లెలో పని చేసే సమయంలో ఆ పాఠశాల విద్యార్థులు 2017లో "స్వచ్ఛభారత్ విద్యాలయ పురస్కార్"కు ఎంపికకావడంలో చురుకైన పాత్ర పోషించారు. సుమారు 200 మంది బయట పిల్లలను ఎంవీ ఫౌండేషన్ ప్రోత్సాహకంతో ఏడో తరగతి పూర్తి చేసేందుకు చొరవ చూపారు. అక్షరాస్యత కార్యక్రమంలో కో–ఆర్డినేటర్‌గా పనిచేశారు.

పాలిటెక్నిక్ లెక్చరర్..


సాయినాథ్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నంద్యాల ఈఎస్‌సీ పాలిటెక్నిక్ లెక్చరర్ డాక్టర్ పోలి సాయినాథ్ రెడ్డి ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం విజయవాడలో నిర్వహించే సభలో సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఐఐటీ మద్రాస్‌లో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ఎంటెక్ పూర్తి చేసి జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ చేశారు. ఎంపికైన అధ్యాపకున్ని పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.


విద్యుత్ దీపాల వెలుగులో కర్నూలులోని వినాయక ఘాట్

'శోభా'యమానం

- కర్నూలు నగరంలో ఆధ్యాత్మిక పరవళ్లు
- రాంబొట్ల దేవాలయం వద్ద తొలిపూజ
- వందలాది విగ్రహాలతో పండుగ వాతావరణం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- కేసీ కెనాల్‌లో కనుల పండువగా నిమజ్జనం
- గట్టి పోలీసు బందోబస్తు మధ్య వీడ్కోలు
- అడుగడుగునా స్వచ్ఛంద సంస్థల సేవలు


కర్నూలులో రాంబొట్ల ఆలయం వద్ద వినాయక స్వామికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుని నిమజ్జనోత్సవం గురువారం కర్నూలు నగరంలో కనుల పండువగా సాగింది. ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయం వద్ద నిమజ్జన శోభాయాత్ర పూజను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ప్రారంభించారు. వేలాది భక్తుల హర్షధ్వానాల మధ్య శోభాయాత్ర ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నగరం నడి మధ్యలో కేసీ కెనాల్‌లో విఘ్నేశ్వరునికి ఘనంగా వీడ్కోలు పలికారు. కేసీ కెనాల్‌కు ఇరువైపుల పది ఘాట్‌లలో ఏడు క్రేన్‌లు, స్టాంటన్ పురం మమతా నగర్ వద్ద ఘాట్‌లో ఒక క్రేన్‌తో, సంతోషనగర్ హైవే తుంగభద్రా నది బ్రిడ్జి వద్ద నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. వినాయక ఘాట్‌లో జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణ, భరతమాత పూజ, వినాయక పూజలు చేసి కలెక్టరేట్ పరిపాలనా విగ్రహం, నగర పాలకం సంస్థ ఆధ్వర్యంలోని వినాయక విగ్రహాలతో నిమజ్జనం మొదలైంది. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహక ఎం.శ్రీనివాసరెడ్డి ముఖ్య వక్తగా హాజరై సందేశమిచ్చారు. ప్రజలను సమైక్యం చేసేందుకే 1893లో బాల గంగాధర్ తిలక్ గణేష్ సామూహిక ఉత్సవాలను ప్రారంభించారన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలుగా నిలుస్తున్నాయన్నారు. కొందరు సనాతన ధర్మాన్ని అంతం చేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారని.. అయితే అది అంత సులువు కాదన్నారు. నేటి తరానికి సనాతన ధర్మ, సంస్కృతి సంప్రదాయాలు తెలియజెప్పేందుకు వినాయక చవితి ఉత్సవాలు దోహదం చేస్తున్నాయన్నారు. సుమారు 1,700 విగ్రహాలు 2వేల మంది పోలీస్‌ల బందోబస్తు, 2వేల మంది స్వచ్ఛంద సేవకుల నడుమ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా సాగింది.

సంప్రదాయబద్ధంగా శోభాయాత్ర

ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని రాంబొట్ల ఆలయం వద్ద మొదటి విగ్రహానికి పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. అక్కడ వినాయక లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఐదో ఏడాది రూ.6,01,000లకు దక్కించుకున్నారు. శోభా యాత్ర సంప్రదాయ బద్ధంగా మేళతాళాలు, డ్రమ్ములు, కోలాటాలు, కర్రల విన్యాసాలు, చెక్క భజనల నడుమ సాగింది. స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల, కేశవ మెమోరియల్ పాఠశాల విద్యార్థుల ఘోష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


గంగ ఒడికి చేరిన గణనాథుడు

పోతిరెడ్డిపాడును పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వివరాలు కేఆర్ఎంబీ చైర్మన్, కమిటీ మెంబర్‌కు వివరిస్తున్న ఎస్ఈ ప్రతాప్

జూపాడుబంగ్లా/పాములపాడు: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంటు బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ బీపీ పాండే, కమిటీ మెంబర్ కేకే జాన్‌గిడ్ పరిశీలించారు. పోతిరెడ్డిపాడు కొత్త, పాత హెడ్‌రెగ్యులేటర్‌లను జలవనరులశాఖ నంద్యాల జిల్లా ఎస్ఈ ప్రతాప్ చూపించారు. పాత హెడ్‌రెగ్యులేటర్ శిథిలమైనందున కొత్త దాని ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. మొత్తం 44 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకొనే అవకాశం ఉన్నా ప్రస్తుతం 30 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నామని తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీటిని బానకచర్ల నీటినియంత్రణ సముదాయం నుంచి తెలుగుగంగ, కేసీ ఎస్కేప్, గాలేరునగరి సుజలస్రవంతి కాల్వలకు సరఫరా చేస్తామని కమిటీ చైర్మన్, మెంబర్‌కు తెలిపారు. ఇప్పటిదాకా పోతిరెడ్డిపాడు నుంచి 130టీఎంసీల నీటిని విడుదల చేశారమని వివరించారు.

ఏపీ ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలో లేవు

కేఆర్ఎంబీ చైర్మన్‌గా బీపీ పాండే కొత్తగా బాధ్యతలు చేపట్టినందున ప్రాజెక్టులను పరిశీలిస్తున్నట్లు ఎస్ఈ ప్రతాప్ విలేకరులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించలేదని, ఏపీలోని ప్రాజెక్టులు కూడా కేఆర్ఎంబీ పరిధిలో లేవన్నారు. పర్యవేక్షణలో భాగంగా వారు ప్రాజెక్టులను పరిశీలించి నీటివిడుదల వివరాలను తెలుసుకొంటున్నట్లు తెలి పారు. కేఆర్ఎంబీ ఆదేశాలను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్రం ఎడాపెడా విద్యుత్‌ను ఎందుకు ఉత్పత్తిచేస్తోందని విలేకరులు ప్రశ్నించగా ఆయన సమాధానం దాటవేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా కాకుండా తెలంగాణ రాష్ట్రం 2,500 క్యూసెక్కుల కన్నా ఎక్కువ నీటిని వినియోగించుకొనే అవకావం లేదని పేర్కొన్నారు. వీరి వెంట తెలంగాణ కేఆర్ఎంబీ ఏడీఈ పవన్, ఏఈ రాజశేఖర్, పోతిరెడ్డిపాడు పర్యవేక్షణ ఈఈ నాగేంద్రకుమార్, డీఈలు సుబ్రమణ్యంరెడ్డి, నగేష్, రఘురాంరెడ్డి, జేఈలు విష్ణువర్ధన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, దేవేంద్ర ఉన్నారు.

ఎంపీడీఓలుగా ఆరుగురికి పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో పరిపాలనాధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న ఆరుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి లభించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ఈ మేరకు పీఆర్ అండ్ ఆర్‌డీ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఆ యన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె 'పోరు'కు సన్నాహాలు

- తాత్కాలిక షెడ్యూల్‌ను ప్రతిపాదించిన ఎస్ఈసీ

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న తాత్కాలిక షెడ్యూల్‌ను జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి పంపింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల పాలన 2021 ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం 2026 ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది. దీంతో ముందస్తుగానే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్రక్రియలను పూర్తి చేసుకునేందుకు తాత్కాలిక షెడ్యూల్‌లో ఏ తేదిల్లోగా ఎలాంటి కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలని సూచించింది.

తాత్కాలిక షెడ్యూల్‌లో సూచించిన మేరకు..

- ➡ ఈ ఏడాది అక్టోబర్ 15వ తేదీ నాటికి మున్సిపాలిటీలు, నగర పంచాయతీలుగా అప్‌గ్రేడేషన్ అయ్యే గ్రామ పంచాయతీల వివరాలు, సమీపంలోని మున్సిపాలిటీల్లోకి విలీనం అయ్యే వాటిని పూర్తి చేసుకోవాలి.
- ➡ అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15లోగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచురించిన ఎలక్ట్రోల్స్ ప్రకారం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఎలక్ట్రోల్స్‌ను రూపొందించుకోవాలి.
- ➡ నవంబర్ 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల తుది ప్రచురణ పూర్తి కావాలి. అలాగే బ్యాలెట్ బాక్సుల రిపేర్లతో పాటు ఈవీఎంల ద్వారా ఎన్నికలను నిర్వహించాలని ప్రతిపాదనలు వస్తే ఈవీఎంలను మొదటి దశలో చెక్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ➡ డిసెంబర్ 15లోగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.
- ➡ డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించాలి.
- ➡ 2026 జనవరిలో ఎన్నికలను నిర్వహించేందుకు తాత్కాలిక షెడ్యూల్‌ను ఎస్ఈసీ ప్రకటించింది.

శ్మశానం పేరిట కుంట పూడ్చి.. చేతులు కలిపి ఆక్రమింగేసి!

- నీటి కుంటను కబ్జా చేసిన టీడీపీ నేతలు
- అనుమానం రాకుండా ప్రజలను మభ్యపెట్టి ఆక్రమణ
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


డీకొట్టాల వద్ద కుంటలో కొద్ది స్థలంలో మట్టి తోలిన దృశ్యం


వరి సాగుకు మాగాణిగా మారిన కుంట

రుద్రవరం: కూటమి ప్రభుత్వంలో వాగులు, వంకలు, చెరువులు, కుంటలకు భద్రత లేకుండా పోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు టీడీపీ నేతలు గద్దల్లా వాలుతున్నారు.అధికారుల అండదండలతో దర్జాగా కబ్జా చేసి సొంతం చేసుకుంటున్నారు. గ్రామ అవసరాల నిమిత్తం పూర్వం నుంచి ఉంటున్న నీటి కుంటను పూడ్చేసి పొలముగా మార్చినా అడిగే నాథుడే లేడు. టీడీపీ నేతలు ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మండలంలోని డీ.కొట్టాల నుంచి శ్రీరంగాపురం వేళ్లే దారి పక్కనే 226 సర్వే నంబరులో 7.50 ఎకరాల్లో ఓ కుంట ఉండేది. వర్షాకాలం నిండు కుండను తలపిస్తూ కళకలాడుతూ ఉండేది. ఆ కుంటలో నీరు నిల్వ ఉండటంతో పశువులు దాహం తీర్చుకునేందుకు, చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ బోరు మోటర్లు రీచార్జ్ అయ్యేందుకు ఉపయోగ పడేది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆ కుంటను ఆక్రమించేందుకు డీ.కొట్టాలతో పాటు శ్రీరంగాపురం, ఎల్లావత్తుల గ్రామాల అధికార పార్టీకి చెందిన ఐదుగురు నాయకులు వేసిన పథకం పారింది.

ఓ ఉన్నతాధికారికి ముడుపులు?

నీటి కుంటను పూడ్చి పొలముగా మార్చడంలో ఓ ఉన్నతాధికారికి ముడుపులు అందాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ నాయకుల ఆక్రమణలకు వంత పాడేందుకు లక్షల్లో తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. గ్రామంలో కుంటను పూడ్చుతున్నారని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడానికి ముడుపులే కారణమని తెలుస్తోంది. నీటికుంట ఆక్రమణపై ఆ గ్రామ వీఆర్వోను వివరణ కోరగా.. రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్కడ కుంట ఉందన్నారు. ప్రస్తుతం అక్కడ ఆ కుంట ఆనవాళ్లు లేవని, కొంత స్థలంలో మట్టి తోలి చదును చేశారని, మిగిలినది అంతా పొలాలు అయ్యాయని చెబుతున్నారు.

శ్మశానం ఏర్పాటు చేస్తామని.. పంటలు సాగు చేశారు!

ఆయా గ్రామాలకు చెందిన ఐదుగురు టీడీపీ నేతలు ముందుగా గ్రామస్తులకు మేలు చేస్తున్నట్లు నమ్మించి దర్జాగా నీటి కుంటను కబ్జా చేశారు. ఈ గ్రామంలో ఎకరా ప్రస్తుతం రూ. 15 లక్షల మేర పలుకుతోంది. 7.50 ఎకరాల విస్తీర్ణంలో కుంటను పూడ్చి కబ్జా చేసి తలా ఇంత పంచుకునేందుకు పథకం వేశారు. గ్రామంలో పూర్వీకుల నాటి నుంచి గ్రామానికి ఓ వైపు 12 సెంట్లలో శ్మశాన వాటిక ఉంది. ఎవరు మృతి చెందినా అంత్యక్రియలు అక్కడే జరుపుకునే వారు. అయితే గత కొద్ది కాలంగా ఆ శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన దారి లేదని టీడీపీ నేతలు తెరపైకి తెచ్చి గ్రామ శివారులో ఉన్న నీటి కుంటలో ఏర్పాటు చేద్దామంటూ నమ్మించారు. వెంటనే మట్టిని తరలించి కుంటను పూడ్చేశారు. ఆ తర్వాత టీడీపీ నేతలు వరి సాగు చేసేందుకు మాగాణిగా మార్చేసి ఆక్రమించారు. టీడీపీ నేతల తెలివి చూసి గ్రామస్తులు నివ్వెరపోతున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పడమర వనములపాడులో గురువారం బోయ నాయుడు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదే గ్రామానికి చెందిన ఒక మహిళతో ఆయన వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. మంగళవారం రాత్రి పోలీసుల ఎదుట హాజరుపర్చగా పద్ధతి మార్చుకోవాలని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. గ్రామంలో తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిందని భావించిన నాయుడు గురువారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు.

మరో ఇద్దరికి డెంగీ

వెల్దుర్తి: మండలంలో డెంగీ కేసులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. గురువారం పట్టణానికి చెందిన ప్రభాకర్, చెరుకులపాడు గ్రామ విజయకుమార్ డెంగీ జ్వరం బారిన పడి చికిత్స పొందుతున్నారు. మొత్తంగా నెలలోపే డెంగీ కేసుల సంఖ్య మండలంలో పదుల సంఖ్య దాటిపోయింది. వీరిలో ఒకరు మరణించగా, కొందరు చికిత్స పొందుతన్నారు. కొందరు కోలుకున్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

కర్నూలు: కర్నూలు ఎన్‌ఆర్ పేటకు చెందిన బంగారు నగలు తయారీ దారుడు షేక్ ఇజేహర్ అహ్మద్ హత్యకేసు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 1వ తేదీ సాయంత్రం రాధాకృష్ణ థియేటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. ఇజేహర్ అహ్మద్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ముగ్గురు వ్యక్తులను బుధవారం నగర శివారులోని పిస్తా హోటల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. రహస్య స్థావరంలో ఉంచి తమదైన శైలిలో విచారిస్తున్నట్లు సమాచారం.

'గమ్మత్తు' టానిక్.. గప్‌చుప్ పోలీస్!

- 'టానిక్' దుకాణం నిర్వాహకుడి అక్రమ వ్యాపారం
- కేసు నమోదుకు తటపటాయిస్తున్న అధికారులు
- దుకాణం టీడీపీ నాయకుడిది కావడమే కారణం
- 6 బాక్సులు ఏపీ, 5 బాక్సుల కర్ణాటక మద్యం సీజ్



టానిక్ దుకాణంలో బుధవారం రాత్రి మద్యం విక్రయాలు జరుపుతున్న దృశ్యం

కర్నూలు: టానిక్... కర్నూలు ఐదు రోడ్ల కూడలిలో కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌డ్ మద్యం దుకాణం. వ్యాపార లావాదేవీలు ఇక్కడే జరగాలి. ఈ దుకాణానికి సంబంధించిన మద్యం మరో చోట అక్రమంగా నిల్వ చేసి విక్రయాలు జరపరాదు. అయితే దుకాణ యజమానులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో తమ వ్యాపారం అక్రమమా.. సక్రమమా.. అని అడిగేవారు ఎవరనే ధీమాతో నిబంధనలు ఉల్లంఘించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకుని కర్నూలు నగరంలో ఎక్సైజ్ అధికారులు డ్రై డే ప్రకటించినప్పటికీ టానిక్ దుకాణం నుంచి రాత్రికి రాత్రే భారీగా మద్యాన్ని తరలించి రహస్యంగా నిల్వ చేసి విక్రయాలు జరుపుతూ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. కర్నూలులోని బిర్లా కాంపౌండ్ రైల్వే గేటు వద్ద నివాసముంటున్న వెంకటేష్ ఇంట్లో అక్రమంగా భారీగా మద్యం నిల్వ ఉన్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. గురువారం ఉదయం ఆ ప్రాంతంలో నిఘా వేసి వెంకటేష్ ఇల్లు గుర్తించి సోదాలు చేయడంతో ఒక్కొక్క బాక్సులో 48 బాటిళ్ల చొప్పున 6 బాక్సుల ఏపీ మద్యం, 5 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. పట్టుబడిన మద్యం ఏ లైసెన్స్‌డ్ షాపునకు చెందినదో అధికారులు ఎక్సైజ్ యాప్ ద్వారా తెలుసుకున్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్ల లేబుళ్లను స్కాన్ చేసి యాప్‌లో తనిఖీ చేయగా 'టానిక్' దుకాణానికి సరఫరా చేసిన మద్యంగా బయటపడింది. అయితే ఆ దుకాణంపై కేసు నమోదు చేయడానికి అధికారులు తటపటాయిస్తున్నారు. ఆ దుకాణం అధికార పార్టీకి చెందిన నాయకులది కావడమే కారణమని తెలుస్తోంది.

మద్యం ప్రియులకు ఎలాంటి లోటు లేకుండా...

కొత్త మద్యం పాలసీ... 24 గంటలూ అందుబాటులో మద్యం... డ్రై డే కూడా మద్యం ప్రియులు మనసారా తాగేశారు. కర్నూలులో గణేష్ నిమజ్జన వేడుకలో మద్యం ప్రధాన భూమిక పోషించింది. నిషేధిత రోజు అయినప్పటికీ వ్యాపారులు ముందు రోజే మద్యాన్ని మరో ప్రాంతంలో నిల్వ చేసి మద్యం ప్రియులకు ఎలాంటి లోటు లేకుండా విక్రయాలు జరిపించారు. కర్నూలు నగరంలో 23 మద్యం దుకాణాలు ఉండగా అవి మూతపడినప్పటికీ అందులో పనిచేసే ఉద్యోగులు విక్రయాలు చేపట్టారు. ప్రధానంగా పాతబస్టాండ్, గాంధీ నగర్, బిర్లా జంక్షన్, చెన్నమ్మ సర్కిల్, సంతోష్ నగర్, నంద్యాల చెక్‌పోస్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న దుకాణం వద్ద మద్యం విక్రయాలు జోరుగా సాగించారు. కోరిన మద్యం అందుబాటులో లభించడంతో మందుబాబులు ఊరేగింపులో పాల్గొని పలుచోట్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన వ్యాపారం

గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని ముందురోజు రాత్రి 10 గంటలకే కర్నూలు నగరంలో ఎక్సైజ్ అధికారులు దుకాణాలు మూయించి సీల్ వేశారు. అయితే టానిక్ దుకాణంలో మాత్రం అర్ధరాత్రి వరకు వ్యాపారం సాగింది. ఎక్సైజ్ అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని మద్యం వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. సాధారణ రోజుల్లో టానిక్ దుకాణంలో రోజుకు రూ.8 లక్షల వరకు వ్యాపారం సాగుతోంది. అయితే బుధవారం అర్ధరాత్రి వరకు 'టానిక్'లో విక్రయాలు జరిపినట్లు మద్యం వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. కర్నూలు నగరంలో 23 మద్యం దుకాణాలు ఉన్నాయి. డ్రై డే సందర్భంగా వాటిని మూయించడంతో టానిక్ దుకాణంలో రూ.30 లక్షలకు పైగా వ్యాపారం సాగినట్లు తోటి వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది.

గతంలోనూ చర్యలు శూన్యం

బెల్టు షాపుల్లో పట్టుబడిన మద్యం ఏ దుకాణందో గుర్తిస్తే మొదటిసారి రూ.2 లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే షాపు లైసెన్స్ రద్దు చేయాలి. జిల్లాలో బెల్టు షాపుల్లో మద్యం పట్టుబడిన కేసులు నమోదవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఒక దుకాణానికి కూడా జరిమానా విధించింది కానీ, లైసెన్స్ రద్దు చేయడం కానీ జరగలేదు. ఇందుకు కారణం 90 శాతం దుకాణాలు అధికార పార్టీకి చెందిన వారివి కావడమే కారణమని ఎక్సైజ్ అధికారులే అనధికారిక చర్చల్లో అంగీకరిస్తున్నారు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్టు

స్థానిక బిర్లాగడ్డ దగ్గర అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్న బోయ వెంకటేశ్వర్లును గురువారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు అందిన సమాచారం మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 472 బాటిళ్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, 275 డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని విక్రయదారుడిని అరెస్టు చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలో డ్రై డే ప్రకటించినందున అక్రమ మద్యం అమ్మకాలు నిరోధించే లక్ష్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరామ నాయుడు, ఎస్‌ఐలు రవితేజ, మారుతి ప్రసాద్ సిబ్బంది నిఘా పెట్టారు. ఈ క్రమంలో మద్యం అక్రమ విక్రయాలపై సమాచారం అందడటంతో బిర్లాగడ్డ దగ్గర ఉన్న బోయ వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసి ఒక స్కూటీతో పాటు అట్టపెట్టెలు, ప్లాస్టిక్ సంచుల్లో దాచివుంచిన మద్యాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే విక్రయదారుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేసి కేసు నమోదు నిమిత్తం కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన మద్యం ఏ దుకాణం నుంచి సరఫరా అయిందనే విషయంపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మద్యం సరఫరా చేసిన దుకాణాన్ని వదిలేసి కేవలం విక్రయదారుడిపై మాత్రమే కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ దాడుల్లో ఎస్‌ఐ రవితేజ, సిబ్బంది మధు, వెంకటరాముడు, రామాంజినేయులు, అల్లస్వామి, షేక్‌షావలి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

డీసీసీబీ ద్వారా రూ.150 కోట్ల రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక రుణాల కింద 2025-26 సంవత్సరంలో రూ.150 కోట్ల రుణాల పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు బడ్జెట్ విడుదల చేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. డీసీసీబీ బ్రాంచీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) ద్వారా రుణాలు పంపిణీ చేస్తారు. రుణాల పంపిణీకి ఆప్కాబ్ కూడా డీసీసీబీకి బడ్జెట్ ఇచ్చింది. దీర్ఘకాలిక రుణాలకు రూ.140 కోట్లు, స్వల్పకాలిక రుణాలకు రూ.10 కోట్ల వరకు బడ్జెట్ విడుదల చేసినట్లుగా బ్యాంకు అధికారులు తెలిపారు. జిల్లాలో 99 పీఏసీఎస్‌లు ఉండగా... దీర్ఘకాలిక రుణాల పంపిణీకి 50 సంఘాలు అర్హత పొందాయి. మిగిలిన సంఘాలు రికవరీలను పెంచుకుంటే బడ్జెట్ ఇవ్వనున్నారు. దీర్ఘకాలిక రుణాల కింద భూమిని బట్టి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు రుణం ఇస్తారు. స్వల్పకాలిక కింద కొత్త రైతులకు పంట రుణాలు పంపిణీ చేస్తారు.

జిల్లాకు 3,502 టన్నుల యూరియా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాకు రానున్న రెండు రోజుల్లో 3,502 టన్నుల యూరియా రానుంది. అయితే యూరియా సక్రమంగా పంపిణీ అవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా.. మార్క్‌ఫెడ్ నుంచి బయటికి వెళ్లే యూరియా కూటమి పార్టీల నేతలను చేరుతోంది. ప్రయివేటు డీలర్లు యూరియా పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించడం అనుమానమేనని తెలుస్తోంది. ఈ కారణంగా సాధారణ రైతులకు యూరియా అందడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కర్నూలు ర్యాక్ పాయింట్‌కు గురువారం స్పిక్ కంపెనీకి చెందిన యూరియా 904 టన్నులు వచ్చింది. అయితే కర్నూలులో గణేష్ విమజ్జన కార్యక్రమం ఉండటం వల్ల రవాణకు లారీలకు అనుమతివ్వలేదు. శుక్రవారం స్పిక్ యూరియా మార్క్‌ఫెడ్‌కు, ప్రయివేటు డీలర్లకు సరఫరా కానుంది. శుక్రవారం కోరమాండల్ యూరియా జిల్లాకు 2,598 టన్నులు రానుంది.

● బలపంపై గురువులు




విద్యావేత్త సర్వేపల్లే రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ బలపం ముక్కపై గురువుల సూక్ష్మ చిత్రాలను గీసి అబ్బుర పరిచారు. మైక్రో బ్రష్ ద్వారా గురువు గొప్ప తనాని బలపం ముక్కపై చూపించారు. చిత్రంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడు.. ఈశ్వరుల స్వరూపమే గురువు అన్నట్లు సర్వేపల్లె రాధాకృష్ణన్‌ను చిత్రీకంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వరా, గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువేనమః అంటారన్నారు. – నంద్యాల(అర్బన్)

WANTED GUNMEN
ప్రముఖ కంపెనీ ద్వారా
కర్నూలు లో
పనిచేయుటకు ఈ క్రింది అభ్యర్థులు కావలెను.
GUNMEN: ప్రభుత్వం వారిచే గన్ లైసెన్స్ కలిగి ఉన్న అభ్యర్థులు.
జీతం: 40,000/- + PF + ESI + INSURANCE
డ్యూటీ: 12 గం., వయస్సు: 50 సం.లోపు
GLADIATOR SECURITY
Santhinagar, Nr. NAD Jn. Vizag
9840645198

'గురు' స్మరణీయులు

- జిల్లాలో 47 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు
- ముగ్గురికి రాష్ట్ర స్థాయి పురస్కారాలు



కర్నూలు సిటీ: ఆన్‌లైన్ పాఠాల సంస్కృతి పెరుగుతున్న నేటి ఆధునిక కాలంలో వారు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారు. అక్షరాలను దిద్దించడమే కాదు..అజ్ఞాన తెరలను తొలగించారు. భావి భారత పౌరులకు ఉజ్వల భవిష్యత్తును అందించారు. విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో కీలకంగా మారిన ఉపాధ్యాయుల కృషికి ప్రశంసలు వచ్చాయి. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో 47 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించనున్నారు. వీరిలో 14 మంది జూనియర్ లెక్చరర్లు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన జూనియర్ కాలేజీ విభాగంలో ఒక్కరికి, పాఠశాల విభాగంలో ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చాయి. జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి అవార్డులు విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో అందుకోనున్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

పాఠశాల విభాగంలో కె.ఎస్ ఆదాం బాషా(ఎంఈఓ-2, సి.బెళగల్), షేక్ ఉస్మాన్ బాషా(జెడ్పీహెచ్‌ఎస్, టి.గోకులపాడు, కృష్ణగిరి మండలం), కె.వెంకటేశ్వర్లు(జెడ్పీ హైస్కూల్, పి.కోటకొండ, దేవనకొండ), పి.మనోరమ(ఎంపీపీఎస్(స్పెషల్)గూడురు), డి.సూర్యప్రకాష్ రెడ్డి(ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ, కర్నూలు), జి.చిన్న బసవరాజు(ఎంపీపీఎస్, ఎస్సీ గాజులదిన్నె, గోనెగండ్ల), వి.సుబ్రమణ్య శర్మ(జెడ్పీహెచ్‌ఎస్, కౌతాళం), ఎస్.వి సౌభాగ్యరాణి(జెడ్పీహెచ్‌ఎస్, గుండ్లకొండ, దేవనకొండ), ఎం.నిరంజన్‌కుమార్(మున్సిపల్ హైస్కూల్, ఆదోని), ఎం.ఏ హలీం సిద్దిఖి(మున్సిపల్ ఉర్దూ బాలిక హైస్కూల్, కర్నూలు), జి.జె సునీల్ రాజ్ కుమార్(ఎస్.ఎం.ఎం, హైస్కూల్, ఆదోని), కె.గోపాల్(జెడ్పీహెచ్‌ఎస్, కపటి, ఆదోని), పున్న లక్ష్మీ రంగన్న(జెడ్పీ హెచ్‌ఎస్, ముజఫర్ నగర్, కర్నూలు), ఎ.చంద్రమోహన్(ఎంపీపీఎస్, లక్ష్మీతాండ, తుగ్గలి), కె.పురుషోత్తం ఆచారి(జెడ్పీహెచ్‌ఎస్, కపటి, ఆదోని)కె.ఎం నాగేంద్రకుమార్(జెడ్పీహెచ్‌ఎస్, కనకవీడు,నందవరం), టి.వి.ఎల్ పద్మావతి(జెడ్పీహెచ్‌ఎస్, ముజఫర్ నగర్), బి.హసీనా(జెడ్పీహెచ్‌ఎస్, దొడ్డనగేరి, ఆదోని), వి.శ్రీనివాసులు(డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం ఆరికెర), యు.ఎస్ అయ్యప్ప(జెడ్పీహెచ్‌ఎస్, కౌతాళం), ఎం.మారుతి(పులికొండ), ఎం.బాలచంద్రుడు(డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ఆరికెర),ఎం.శోభాదేవి(ఎంపీపీఎస్, ఈర్నపాడు), కళ్యాణికుమారి(ఎంపీపీఎస్, జే.ఎం తాండ, పత్తికొండ), కె.అరుణజ్యోతి(ఎంపీపీఎస్ కన్నడ, బదినేహాల్),ఎం.రామ్మోహన్(ఎంపీపీఎస్, మాధవరం), డా.శ్రీదేవి(డీసీఓ, ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్), యమున(డీసీఓ, మహాత్మజ్యోతిరావుఫూలే స్కూల్స్), డి.దుర్ధానా ఫర్హీన్(ఎంపీపీఎస్, బీ.ఎస్, గోనెగండ్ల).

జూనియర్ కాలేజీ విభాగంలో..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులకు 14 మందికి జిల్లా స్థాయి అవార్డులు ఇవ్వనున్నారు. కర్నూలు టౌన్ కాలేజీకి చెందిన అధ్యాపకులు జి.గీత(కెమిస్ట్రీ), వి.లావణ్య(హిస్టరీ), వి.నాగరాజు(బోటనీ), జి.ప్రమీలా(ఎకనామిక్స్), కెవిఆర్ కాలేజీకి చెందిన అధ్యాపకులు షేక్ రేష్మ(బోటనీ), షేక్ షాహీనా బేగం(ఫిజిక్స్),జి.శ్రీనివాసులు(జువాలజీ), కె.సువర్ణదేవి(హిస్టరీ), ఎస్.అఫ్రోజ్ సుల్తానా(కెమిస్ట్రీ), జే.వి రమణ గుప్తా(ఇంగ్లీషు), యు.మధుసూదన్(తెలుగు), ఆర్.సురేష్(హిస్టరీ, గోనెగండ్ల), ఈ.మల్లన్న(కామర్స్, మంత్రాలయం), కె.సుధీయేంద్రకుమార్(మైనార్టీ కాలేజీ, కర్నూలు)లకు అవార్డులు వచ్చాయి.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన వారు..

పాఠశాల విభాగంలో పత్తికొండ మండలం హోసూరు ఎంపీపీఎస్(డబ్ల్యూ)లో పనిచేస్తున్న సెకండ్ గ్రేడ్ టీచర్ జి.వినూత, సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు టీచర్ ముతూకురి గోపాల ఆచార్యులుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కౌతాళం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జువాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్న ఎం.సంతోష్‌కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డు అందుకోనున్నారు.

వదినను చంపిన మరిది

- వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని..



సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ తిరుపాలు

పగిడ్యాల: వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో సొంత వదినను మరిది హత్య చేసిన ఘటన ఎం. ఘణపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శేఖర్ నాయక్, సుగాలి నాగమ్మ(60) నలుగురు పిల్లలు. వారంతా పెళ్ళిళ్లు చేసుకుని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 15 ఏళ్ల క్రితమే శేఖర్ నాయక్ మృతి చెందగా నాగమ్మ గ్రామంలో ఒక్కతే ఒంటరిగా ఉంటోంది. కాగా రైతుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని ఆమె మరిది లోక నాయక్ అనుమానిస్తూ తరచూ హెచ్చరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె గురువారం ఉదయం తిరిగి చేరింది. ఇది పసిగట్టిన లోక నాయక్ ఆమెను అడ్డుకుని మందలించాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపోద్రేక్తుడైన అతను రాడ్‌తో తల వెనుక భాగంలో కొట్టగా వెంటనే అక్కడికక్కడే కుళాయి పైప్‌లైన్‌పై పడిపోయి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం సంఘటన స్థలానికి చేరుకున్నారు. మహిళ మృతిపై స్థానికులను విచారించి ఆధారాల సేకరణకు క్లూస్ టీంను రప్పించారు. మృతురాలి మరో మరిది కుమారుడు చంద్రనాయక్ ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి స్టేషన్ ఏఎస్‌ఐ శేషయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడి లోక నాయక్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు

రేపటి నుంచి వేరుశనగ మార్కెట్ ప్రారంభం

- పైలట్ ప్రాజెక్టు కింద వారం రోజులపాటు పాసింగ్ లేకుండా కొనుగోలు



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న వ్యాపారులు, అసోసియేషన్ నాయకులు

ఆదోని అర్బన్: పది రోజుల నుంచి ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్తంభించిన వేరుశనగకాయల క్రయవిక్రయాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు, యార్డు అధికారులతో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. పైలట్ ప్రాజెక్టు కింద వారం రోజులపాటు పాసింగ్ లేకుండా వ్యాపారస్తులు టెండర్ వేసి కొనుగోలు చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. దీంతో వ్యాపారస్తుల అసోసియేషన్ అధ్యక్షుడు శరణబసప్ప, సభ్యులు మస్తాన్‌వలి, నాగరాజు తదితరులు రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడులను ఆరబోస్తే తాము పరిశీలించి లాభసాటి అయిన ధరలను వేసుకుంటామని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో సబ్‌కలెక్టర్ రైతులకు నష్టం కలిగించకుండా చూడాలన్నారు. వారం రోజులపాటు పైలట్ ప్రాజెక్టు కింద పాసింగ్ లేకుండా వ్యాపారస్తులు కొనుగోలు చేయాలని, వారం రోజుల్లో ఏదైనా సమస్య వస్తే మళ్లీ చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఇందుకు వ్యాపారస్తులు ఒప్పుకున్నారు. సమావేశంలో యార్డు సెక్రటరీ కల్పన, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సూపర్‌వైజర్‌లు, కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు రాజాగౌడ్, శ్రీరాములు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు



మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: నంద్యాల మెడికల్ కళాశాలలోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రూ.8.70 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోరిక మేరకు రైల్వే సీఎస్ఆర్ నిధులతో రూ.8.70 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను నిర్మించామన్నారు. మెడికల్ కళాశాల లోపల కేసీ కెనాల్ వెళ్తోందని ఆ ప్రాంతంలో పచ్చదనం, బెంచీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామనప్నారు. ఇందుకు రూ.40 లక్షల ఖర్చు చేసి పక్షం రోజుల లోపల పనులు పూర్తి చేస్తామన్నారు.

పెద్దాసుపత్రిలో...

నంద్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో థైరాయిడ్ తదితర టెస్టులు నిర్వహించేందుకు, అవసరాలకు ఆర్వో ప్లాంట్ కావాలని అక్కడి వైద్యులు అడిగారని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.5.45 లక్షలతో ప్యూరిఫైడ్ వాటర్ సిస్టంను ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మెడికల్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

TUTIONS

■ 5th నుండి 10th వరకు అన్ని సబ్జెక్టులకు ట్యూషన్స్ చెప్పబడును. సంప్ర: కెయస్‌ఆర్ ట్యూషన్స్, కృష్ణకాంత్ ప్లాజా, కర్నూలు. సెల్: 9491408359, 8519946434. [SCA25007790]

TRAINING

■ క్యాడేట్ డిఫెన్స్ అకాడమీ నవోదయ సైనిక్ స్కూలు ఎంట్రన్స్‌కు షార్ట్ టర్మ్ కోచింగ్ ప్రారంభం. సంప్ర: కృష్ణకాంత్ ప్లాజా, కర్నూలు. సెల్: 9491408359, 8519946434. [SCA25007791]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : ✆ 73821 14647. [V-6811]

WANTED

■ మా సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. మంచి జీతం+ESI, PF, TA, DA. వివరాలకు సంప్ర: 79933 40702. [SCA25007862]

■ Work From Home : ఫీమేల్ టెలికాలర్స్ కావలెను. 5 రోజులు ట్రైనింగ్ తీసుకొని ఇంటి దగ్గరే జాబ్ చేసుకోవచ్చు. కర్నూలు టౌన్, బిర్లా గేట్, జగదీష్ మాల్, సెకండ్ ఫ్లోర్: 201, సెల్: 99666 76646. [SCA25007761]

■ ఉలిందకొండలోని మా సంస్థ నందు పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ: 12 గంటలు, జీతం: 16,500, వయసు: 25-45సం॥. వివరాలకు సంప్రదించండి: 91829 64173. [SCA25007863]

■ ప్రముఖ అమెజాన్ ఫ్లిప్కార్ట్ వంటి MNC సంస్థలలో పనిచేయుటకు యువతీ/యువకులు కావలెను. Qul: 10th-డిగ్రీ, జీతం: 15000/- ఆపైన. అర్హతను బట్టి మంచి ఆదాయం. 95918 20747 [G-736]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd. 7993583999 [HA-16134]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663 [SCA25007794]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉల్లి.. కుళ్లి'పాయె'!

- వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంట
- కోత కోసి ఆరబెట్టిన దక్కని ప్రయోజనం
- మార్కెట్‌లో ధర లేక పొలంలోనే వదిలేస్తున్న రైతులు



దారివెంట ఉల్లి దిగుబడులను వదిలేసిన దృశ్యం



ముడుమాల దగ్గర బస్తాలతో పాటు పడేసిన దృశ్యం



ఎల్‌దొడ్డి దారిలో రోడ్డపక్క డ్రైనేజీలో పారబోసిన ఉల్లి దిగుబడి

సి.బెళగల్: ఖరీఫ్‌లో ఉల్లి సాగు చేసిన రైతులు కన్నీరు పెడుతున్నారు. చేతికొచ్చిన దిగుబడిని కాపాడుకోలేక, మార్కెట్‌లో విక్రయించలేక నష్టాలు మూటగట్టుకుంటున్నారు. తుంగభద్ర నదితీర గ్రామాలైన తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల గ్రామాల్లో రైతులు అత్యధికంగా ఉల్లి సాగు చేశారు. అదేవిధంగా బోర్లు, బావులు, ఎత్తిపోతల పథకం నీటి వనరుల ద్వారా పోలకల్, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో సైతం ఉల్లి పంటలను రైతులు సాగు చేశారు. మొత్తం మండల వ్యాప్తంగా 2,630 ఎకరాల్లో సాగు చేశారు. కాగా పంట చేతికి దిగుబడులు వచ్చేసరికి మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించకపోవడం, అధిక వర్షాలతో రైతులు నష్టాలపాలయ్యారు. ప్రస్తుతం ఉల్లి పంట కోతలు పూర్తికావడంతో దిగుబడి నిల్వలను రైతులు పొలాలు, కల్లాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేసుకున్నారు. కనీసం రవాణా చార్జీలు వచ్చే పరిస్థితి లేకపోవడం, కొన్నాళ్ల పాటు నిల్వ చేసుకునే ఏర్పాట్లు ప్రభుత్వం కల్పించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో దిగుబడులను ఎక్కడ పడితే వదిలేస్తున్నారు. దీంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోయి గ్రామాల్లో దుర్వాసన వస్తోంది. ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.